క్లుప్తంగా

ట్రస్మా ఉపాధ్యక్షుడిగా బేరే యాదగిరి ఎన్నిక



భీమదేవరపల్లి : మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన బేరే యాదగిరి ట్రస్మా హసన్‌పర్తి జోన్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆయన ముల్కనూర్‌లోని న్యూ మోడల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్‌గా పని చేస్తున్నాడు. తన నియమకానికి సహకరించిన వారికి యాదగిరి కృతజ్ఞతలు తెలిపాడు.

సీపీఎం నాయకులపై కేసు నమోదు

దామెర : ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసిన ఘటనలో సీపీఎం నాయకులపై కేసులు నమోదు చేసిన ఘటన మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని ఈరాయి చెరువు సమీపంలో సర్వే నంబర్ 128లోని 30 ఎకరాల భూమిలో సీపీఎం ఆధ్వర్యంలో దామెర, ల్యాదెళ్ల, ముస్త్యాలపల్లి, దమ్మన్నపేట్, ములుగు జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన పలువురు ఇటీవల సుమారు 60 గుడిసెలు వేశారు. కాగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి గుడిసెలు వేశారని తహసీల్దార్ రియాజుద్దీన్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో గుడిసెలు వేసేలా ప్రోత్సహించిన సీపీఎం నాయకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భార్య, అత్తపై దాడి..

దామెర : భార్య, అత్తపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దాపోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన మేకల లక్ష్మిని గీసుగొండ మండలంలోని శాయంపేట హవేలీకి చెందిన కోటగిరి సునీల్‌కు ఇచ్చి పదేళ్ల క్రితం వివాహం జరిపించారు. అప్పటి నుంచి సునీల్ భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. దీంతో లక్ష్మి కొంతకాలంగా తల్లి మేకల సరోజన వద్ద ఉంటోంది. ఈ క్రమంలో ఈనెల 6న సాయంత్రం సునీల్ ఊరుగొండకు వచ్చి భార్య లక్ష్మిపై బీరు సీసాతో దాడి చేశాడు. అడ్డుకునేందుకు యత్నించిన సరోజనపైనా దాడి చేశారు. లక్ష్మి, సరోజన గాయాలయ్యాయి. తనతోపాటు తన కూతురు లక్ష్మిని చంపుతానంటూ సునీల్ బెదిరించినట్లు సరోజన ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

శాయంపేట : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం తలపెట్టిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. సమావేశానికి ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ, అధికారులు హాజరు కాగా ఎంపీటీసీలు రాలేదు. దీంతో వాయిదా వేస్తూ ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి ప్రకటించారు. ఇదిలా ఉండగా గండ్ర దంపతులు మండల సభకు రావడం లేదనే సమాచారం మేరకే ప్రజాప్రతినిధులు మీటింగ్‌కు హాజరు కాలేదనే ప్రచారం జోరుగా సాగింది. 2019 నుంచి ఇప్పటివరకు 16 సార్లు సమావేశం జరగాల్సి ఉండగా కేవలం 11 సార్లు మాత్రమే జరిగింది. ఐదు సార్లు కోరం లేక వాయిదా పడింది. ముందస్తు సమాచారం ఉన్నా సభ్యులు సమావేశానికి రాకపోవడం గమనార్హం.

ఆర్థికసాయం



నడికూడ : మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన ఉగ్గి రాజమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ మంగళవారం పరామర్శించారు. అనంతరం ఇనగాల ట్రస్ట్ నుంచి ఆర్థికసాయం చెక్కు అందజేసి ఓదార్చారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు భోగం కమల, నాయకులు మల్లారెడ్డి, చాడ రవీందర్‌రెడ్డి, రమేష్, బిల్లారం భిక్షపతి, కట్టయ్య, కొమురయ్య, రాజయ్య, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీ కాలేజీలో క్రీడాపోటీలు

రామన్నపేట : నగరంలోని లాల్‌బహదూర్ (ఎల్బీ) కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు డిగ్రీ అంతర్ తరగతుల క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఈ పోటీలు ఉపయోగపడుతాయన్నారు. వివిధ సంస్థల్లో రెండు శాతం స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. కళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బాల్‌బాడ్మింటన్, చెస్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రీడల కన్వీనర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత

- దళితబంధు జిల్లా కన్వీనర్ రామకృష్ణ



సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణ

పరకాల : బాల్యవివాహాల నిర్మూలనను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని దళితబంధు జిల్లా కన్వీనర్ సోదా రామకృష్ణ ఆకాంక్షించారు. పరకాల మదర్సాలో ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సమితి, వరంగల్‌కు చెందిన గర్ల్స్ అడ్వకేసీ యాక్షన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఖాజీ సయ్యద్ అజీజుద్దీన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రామకృష్ణ హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు విద్యను అందించడంతోపాటు సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై అవగాహన కల్పిస్తేనే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాల వల్ల చాలా వరకు బాల్యవివాహాలు నిలిచిపోయాయని చెప్పారు. బాల్యవివాహం వల్ల జరిగే నష్టాలను వివరించడం ద్వారా చైతన్యవంతం చేయాలని సూచించారు. బాలికలందరికీ విద్య అవసరమనే విషయాన్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గుర్తించాలని చెప్పారు. విద్యార్థులు బాల్యవివాహాలు, ఇతర దురాచారాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. విద్యార్థులను చైతన్యవంతం చేసే దిశగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చొరవ చూపాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మార్క ఉమాదేవి, కోఆప్షన్ సభ్యురాలు ముఫానా ఫాతిమా, షబ్బీర్ అలీ, ముస్లిం మత పెద్దలు హాజీ మసూద్, నజీమ్ అక్సర్, సత్యసాయి సేవా ట్రస్ట్ కన్వీనర్ లింగయ్య, విద్యాలయ పాఠశాల చైర్మన్ గోపి, ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సమితి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బత్తుల కరుణ, పీఓ ఎర్ర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా సమావేశాలు

- బీజేపీ రాష్ట్ర నాయకుడు రాజయ్య యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్యయాదవ్

దామెర : ఈనెల 10 నుంచి 25 వరకు తలపెట్టిన స్ట్రీట్ కార్నర్ ద్వారా బీజేపీ బలోపేతం అవుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కన్నెబోయిన రాజయ్య యాదవ్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ స్ట్రీట్ కార్నర్ సమావేశాలు విజయవంతం చేయాలని ఆయన కోరారు. మండలంలోని కోగిల్వాయిలో మంగళవారం నిర్వహించిన పార్టీ మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజయ్య హాజరై మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం అయ్యేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్యవంతం చేయాలని చెప్పారు. సీఎం కేసీఆర్ పతనం మొదలైందని తెలిపారు. స్ట్రీట్ కార్నర్ సమావేశాల అపెంబ్లీ కన్వీనర్, జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఓటమి కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ప్రజాసమస్యలను తెలుసుకోవడంతోపాటు కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. తొలుత పార్టీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు పార్టీ జెండా ఆవిష్కరించారు. సమావేశంలో కోకన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, జిల్లా నాయకులు గంకిడి బుచ్చిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు వేల్పుల రాజ్‌కుమార్, గన్ను సతీష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు దండు పద్మ, నవ్య, నాయకులు జగన్, పిట్టల రమేష్, సూర చందర్, చంద్రకిరణ్, దామెరుప్పుల నాగరాజు, రమేష్, ఇమ్మానియేల్, చుక్క మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కమలాపూర్ : స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కంటి వెలుగు శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలానికి చెందిన పలువురు జర్నలిస్టులు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హర్షిణీప్రియ మాట్లాడారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో సుమారు 140 మందికిపైగా పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు అందించినట్టు చెప్పారు. అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు శిబిరాలను 18 ఏళ్లకుపైబడ్డ ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, డాటా ఎంట్రీ ఆపరేటర్ శృతి, హెచ్ఈఓ రమేష్, హెల్త్ సూపర్‌వైజర్ విప్లవ్‌కుమార్, జర్నలిస్టులు పులికంటి రాజేందర్, బాలసాని దేవేందర్‌గౌడ్, గట్టు ఏడుకొండల్‌గౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాలతోనే పేదలకు న్యాయం



మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

శాయంపేట : వామపక్ష పార్టీలతోనే పేదలకు న్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మండలానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరికిళ్ల దేవయ్య, బీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మారపల్లి క్రాంతికుమార్‌తోపాటు సుమారు 50 మంది మంగళవారం సీపీఐలో చేరగా వారిని కండువా కప్పి పార్టీలోకి శ్రీనివాసరావు ఆహ్వానించి మాట్లాడారు. పార్టీ పేదల పక్షాన నిరంతరం పోరాడుతున్నట్టు తెలిపారు. పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు భూపోరాటం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు సాధించేలా పోరాడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బోగి రమేష్, పాలెపాక ప్రసాద్, మోరె రవి, బోగి కన్నయ్య, మారపల్లి సారయ్య, భాస్కర్, వెంకన్న, శ్రీకాంత్, రాజకుమార్, రాజయ్య, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కార్మికులకే అన్యాయమా..?



దీక్షను ప్రారంభిస్తున్న భిక్షపతి మాదిగ

హన్మకొండ: జిల్లా కోర్టులోని కార్మికులకే అన్యాయం జరిగితే ఎక్కడికి వెళ్లాలని కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నించారు. వరంగల్ జిల్లా కోర్టులో గత తొమ్మిది సంవత్సరాలుగా పనిచేస్తున్న హౌస్ కీపింగ్ వర్కర్స్‌ను తొలగించడాన్ని నిరసిస్తూ మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. వారం రోజుల పాటు చేపట్టనున్న ఈ దీక్షలను టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, సీఐటీయూ నాయకుడు టి.ఉప్పలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంట్రాక్టర్ గొట్టిపాటి రామచంద్రరావు 11 నెలల క్రితం లేబర్ కాంట్రాక్ట్ దక్కించుకొని 11 మంది హౌస్ కీపింగ్ వర్కర్స్‌కు నియమించుకుని ఒక్కొక్కరికీ నెలకు రూ.5,000 వేతనంతో చెల్లించాడని తెలిపారు. ఈఎస్ఐ,పీఎఫ్ చెల్లిస్తానని వీరి నుంచి వసూళ్లు చేసి కాజేశాడని ఆరోపించారు. తొమ్మిది సంవత్సరాలుగా పని చేస్తున్నవారిని అకారణంగా తొలగించాడని మండిపడ్డారు. కాంట్రాక్టర్ గొట్టిపాటి రాంచందర్ రావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిఎడల పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కాకతీయ కెనాల్ నీరు వినియోగం

వరంగల్ అర్బన్: కాకతీయ కెనాల్ నుంచి రా వాటర్‌ను శుద్ధి చేస్తూ పలు కాలనీలకు తాగునీటి సరఫరా చేసే ప్రక్రియకు ఇంజినీర్లు ఉపశమనం కల్పించేందుకు సోమవారం సాయంత్రం నుంచి శ్రీకారం చుట్టారు. ఈనెల 6న 'సాక్షి'లో 'తాగునీటి సరఫరా బంద్' వార్త ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన కమిషనర్ ప్రావీణ్య, బల్దియా ఇంజినీర్లతో చర్చించి కెనాల్ నీటిని వినియోగించాలని ఆదేశాలు ఇచ్చారు. బల్దియా ఇంజినీర్లు కాకతీయ కెనాల్ నుంచి కేయూసీ ఫిల్టర్ బెడ్, దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌కు రా వాటర్ తీసుకొని శుద్ధి చేస్తున్నారు. హన్మకొండ, వరంగల్ ప్రాంతాల్లో పలు కాలనీల్లో రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నారు. అవసరమైన కాలనీలకు వాటర్ ట్యాంకర్లను పంపిస్తామని బల్దియా ఇంజినీర్లు పేర్కొన్నారు. ధర్మసాగర్ చెరువు వద్ద బటర్ ఫ్లై వాల్వ్‌ల ఏర్పాటు ప్రక్రియ బుధవారం పూర్తి కావాల్సి ఉన్నా మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉందని ఇంజినీర్లు పేర్కొన్నారు. గురువారంలోగా పనులు పూర్తయితే 8 గంటల సమయం తర్వాత ఫిల్టర్‌బెడ్లకు, రిజర్వాయర్లకు నీరు చేరుతుంది. శుక్రవారం ఉదయం నుంచి నీటి సరఫరా జరగనుందని తెలిపారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

ఖిలా వరంగల్: ప్రైవేట్ పరిశ్రమలు, ఐటీ, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో ఎస్సీ, ఎస్టీలకు పక్కాగా రిజర్వేషన్లు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ హక్కుల పోరాట సమితి ప్రతినిధులు మంగళవారం హనుమకొండలోని కార్యాలయంలో వరంగల్ కలెక్టర్ గోపిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదిగ రిజర్వేషన్ హక్కుల పోరాట సమితి నాయకుడు చింత భాస్కర్ మాట్లాడారు. జిల్లాలోని ప్రైవేట్ పరిశ్రమలు, ఐటీ సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలను చట్ట పరిధిలోనే కొనసాగించాలని సూచించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ పరిశ్రమలు, ఐటీ, వ్యాపార, వాణిజ్య సంస్థలో పక్కా రిజర్వేషన్లు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కలెక్టర్‌ను కోరగా కలెక్టర్ పరిశీలిస్తానని చెప్పినట్లు ఆయన తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు కట్టయ్య, ప్రభాకర్, శ్యాం తదితరులున్నారు.

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం



ఎల్కతుర్తి : 2023–24 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి అధిక నిధులు కేటాయించిందంటూ సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ది విశాల సహకార సంఘంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి, గ్రామీణ అభివృద్ధికి నిధులు కేటాయించడంతోపాటు రైతులకు లక్ష రుణమాఫీ ప్రకటించినందుకు సీఎం కేసీఆర్‌కు, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని చెప్పారు. రైతులకు ఇచ్చిన హామీల ప్రకారం 24 గంటల ఉచిత కరెంట్, సాగునీరు, తాగునీరు, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ తదితరాలు చేపట్టినట్టు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని వర్గాలకు న్యాయం చేసేలా రూ.2.90 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చే దిశగా కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తోందని కొనియాడారు. సమావేశంలో వైస్ చైర్మన్ మునిగడుప శేషగిరి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరింగ్‌పై ప్రశ్నిస్తే ఆరోపణలు

నడికూడ : పాఠశాలలో చేపట్టిన ఫ్లోరింగ్‌పై ప్రశ్నిస్తే సర్పంచ్ ఊర రవీందర్‌రావు తనపై లేనిపోని ఆరోపణలు చేశారని మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పట్టాభి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో రూ.2.10 లక్షల వ్యయంతో చేపట్టిన ఎలక్ట్రికల్ పనులు చేసిన క్రమంలో బిల్లు ఇవ్వడం లేదంటూ సర్పంచ్ ఊర రవీందర్‌రావు సోమవారం చేసిన ఆరోపణలపై హెచ్ఎం పట్టాభి స్పందించారు. ఎలక్ట్రికల్ పనులకు సంబంధించి రూ.2.13 లక్షల చెక్ రాగానే సర్పంచ్ ఇచ్చినట్టు హెచ్ఎం ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఫ్లోరింగు పనులు జిల్లా కలెక్టర్ సూచన మేరకు లేకపోవడంతో సంబంధిత ఏఈకి తెలియజేయగా ఫొటోలు వాట్సప్ చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సర్పంచ్ 15 మందితో కలిసి పాఠశాలకు వచ్చి తనపై దాడికి యత్నించారని వివరించారు. సర్పంచ్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని హెచ్ఎం పట్టాభి స్పష్టం చేశారు. అనంతరం సర్పంచ్‌కు ఇచ్చిన చెక్ జిరాక్స్‌ను పత్రికలకు విడుదల చేశారు.

ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా నియామకం



నియామక పత్రం అందుకుంటున్న భగవాన్‌గౌడ్

ఎల్కతుర్తి : బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గొడిశాల వినయ్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు వినయ్‌గౌడ్‌కు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాడి చిరంజీవి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నియామక పత్రం అందజేశారు. అలాగే సోషల్ మీడియా కన్వీనర్‌గా దామెరకు చెందిన పాటి భగవాన్‌గౌడ్‌ను నియమించారు. వారి నియామకం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వినయ్, భగవాన్‌గౌడ్ మాట్లాడారు. తమకు పదవులు కట్టబెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు దండ దేవేందర్‌రెడ్డి, పెరుకు మధుకర్, వెంకటరమణ పాల్గొన్నారు.

తాటిచెట్లు నరికివేత

హసన్‌పర్తి : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 56వ డివిజన్ బ్యాంక్‌కాలనీ ప్రాంతంలోని తాటిచెట్లు నరికి వేశారు. నగరానికి చెందిన బొల్లం లింగారెడ్డి అనే రియల్టర్ ఈ వ్యవహారానికి పాల్పడినట్లు గౌడ సంఘం అధ్యక్షుడు చింత రమేష్‌గౌడ్ తెలిపారు. 12 చెట్లు నేలమట్టం చేయడం వల్ల వాటిపై ఆధారపడి ఉన్న కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మణీంధర్ నాథ్ సందర్శించారు. తాటిచెట్లు నరికిన లింగారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ (కేయూ) పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాటిచెట్లు నరికిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గీతకార్మికులు దూలం అనిల్‌కుమార్, దూలం శ్రీనివాస్, కోలా కృష్ణమూర్తి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



ఉపాధ్యాయురాలిగా బోధిస్తున్న విద్యార్థిని

దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ జోరు కొనసాగింది. పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను మరిపించేలా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి స్ఫూర్తిగా నిలిచారు. ప్రధానోపాధ్యాయుడుగా కె.రాంచరణ్, ఎంఈఓగా యశ్వంత్, డీఈఓగా అభినయ్ కుమార్‌తోపాటు పలువురు విద్యార్థులు వివిధ సబ్జెక్టుల టీచర్లుగా వ్యవహరించి సందడి చేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ మాట్లాడారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు స్వయంపాలన లాంటి కార్యక్రమాలు దోహద పడతాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ రాచర్ల గణపతి, వెకట్‌రెడ్డి, కృష్ణవేణి, సోమన్న, అనిత, విద్యారాణి, విజయప్రభ, విజయరాణి, రజిత, శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ ఆకస్మిక తనిఖీ



పరకాల : తనిఖీ చేస్తున్న డీసీపీ పుల్ల కరుణాకర్



ఆత్మకూరులో..

పరకాల : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పుల్లా కరుణాకర్ మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. భవనాల నిర్మాణాలపై పరకాల ఏసీపీ శివరామయ్యను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో పచ్చదనంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్ మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏసీపీ శివరామయ్య, సీఐ గణేష్ ఉన్నారు.

పదోన్నతుల కల్పనలో న్యాయం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న భాషా పండితులు

ఎల్కతుర్తి : పదోన్నతులు కల్పించే విషయంలో తమకు న్యాయం చేయాలని భాషా పండితులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మండలంలోని బావుపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రథమిక పాఠశాల ప్రాంగణంలో కోర్స్ డైరెక్టర్ లావుడ్య మనోహర్ నాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర నాయకుడు నాగుల భిక్షపతి మాట్లాడారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఉపాధ్యాయ పదోన్నతుల్లో అవకాశం కల్పించని పరిస్థితిలో జాబ్‌చార్జ్ ప్రకారమే పని చేస్తామన్నారు. 9, 10వ తరగతుల విద్యార్థులకు సబ్జెక్టులు బోధించామని తెలిపారు. 17 ఏళ్లుగా పదోన్నతి కల్పించడం లేదని వాపోయారు. పదోన్నతులు కల్పిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినా కోర్టు కేసును సాకుగా చూపి విస్మరించారని విమర్శించారు. అన్ని క్యాడర్లకు కల్పిస్తున్న తరహాలోనే తమకు సైతం పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకుడు ఎఫ్ఎస్.అలీ, సీఆర్పీ రవికుమార్, మండల నాయకులు విజయ్‌కుమార్, శ్రీనివాస్, తస్నీం, మాధవి, ముంతాజ్, అనురాధ, సుజాత పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి



చౌటుపర్తిలో మాట్లాడుతున్న డీఎం కృష్ణమూర్తి

నడికూడ : ఆర్టీసీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని పరకాల డిపో మేనేజర్ (డీఎం) కృష్ణమూర్తి కోరారు. మండలంలోని చౌటుపర్తి గ్రామంలో 'ప్రజల వద్దకే ఆర్టీసీ' పేరుతో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమన్నారు. మారుమూల పల్లెలకు సైతం బస్సులు నడిపిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవడం ద్వారా సంస్థకు తోడ్పాటు అందించాలని కోరారు. ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ఆర్.కృష్ణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా కమల



కమలకు నియామక పత్రం అందజేస్తున్న సరళ

నడికూడ : మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన భోగం కమలను కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా నియమించారు. ఈ మేరకు ఆమెకు జిల్లా అధ్యక్షురాలు బంక సరళ దేవి మంగళవారం నియామక పత్రం అందజేశారు. కమల పార్టీకి అందించిన సేవలను గుర్తించి నియమించినటుట్లు సరళ దేవి పేర్కొన్నారు. అనంతరం కమల మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ హయాంలోనే సుపరిపాలన అందుతుందని తెలిపారు. మహిళలను చైతన్యవంతం చేస్తానని చెప్పారు. తనను నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ



హన్మకొండ : బ్యాగులు, పుస్తకాలతో విద్యార్థులు

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని ఆనంద నిలయంలోని అనాథ విద్యార్థినులకు తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ కార్యదర్శి, టీఎస్ ఎన్పీడీసీఎల్ ఏడీ బక్క దానయ్య, పాశం రాజేశ్వర్ పుస్తకాలు, బ్యాగులు, టవల్స్ అందించారు. మంగళవారం ఆనంద నిలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంజీఎం ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ రామ్మోహన్ చేతుల మీదుగా అనాథ విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, టవల్స్ అందించారు. విద్యార్థులతోపాటు, ఆశ్రమంలో పనిచేస్తున్న సిబ్బందికి అనారోగ్య సమస్యలు ఉంటే తగిన చికిత్స అందిస్తానని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రౌతు రమేష్ కుమార్, స్వదేష్ కుమార్, రాజారపు, చలపతి, కృష్ణ, రాజేశ్వర్, వినోద్ కుమార్, శ్యామ్ కుమార్, విజయ్, సుజాత పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కాజీపేట: కాజీపేట విద్యానగర్ కాలనీలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు పూర్వ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఇదే పాఠశాలలో 1985–86 విద్యా సంవత్సరంలో టెన్త్ విద్యార్థులు రూ.50 వేల విలువైన స్టడీ మెటీరియల్ అందజేశారు. పూర్వవిద్యార్థులను హెచ్ఎం సుధాకర్ అభినందించారు. కార్యక్రమంలో టి.వేణు, అయ్యాల దానం, రామకృష్ణ ప్రసాద్, బండి యాదగిరి, సయ్యద్ బందిలీ పాల్గొన్నారు.